# అసలేకాశ్మీరీ, ఆపైన ముస్లిం

## ఇఫ్తిఖార్ గిలానీ అరెస్టు ప్రహసనం

ఇఫ్తిఖార్ గిలానీ చిన్న వయసులోనే జర్నలిస్టుగా ప్రముఖ స్థానాన్ని సాధించిన కాశ్మీరీ యువకుడు జమ్ముకాశ్మీర్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలోనూ అధికంగా అమ్ముడుబోయే కాశ్మీర్ టైంస్ అనే ఆంగ్లదిన పత్రికలో రిపోర్టర్‌గా చేరాడు. త్వరలోనే ఆ పత్రిక ఢిల్లీ బ్యూరో చీఫ్ అయ్యాడు. ఆపోస్ట్‌లో ఉండగానే పాకిస్తాన్‌కు చెందిన 'దినేషన్' అనే దిన పత్రిక ఢిల్లీ రిపోర్టర్ అయ్యాడు. ఢిల్లీలోని విదేశీ పత్రికా విలేకరుల ప్రపంచంలో చురుకైన వ్యక్తిగా మెలగసాగాడు. ఇఫ్తిఖార్ గిలానీ ఇప్పుడు ఢిల్లీలోని తిహార్‌జైలులో ఉన్నాడు.



కె. బాలగోపాల్

అతని నేరం ఏమి?

అతని కంప్యూటర్‌లో భారత సైన్యానికి సంబంధించిన 'సున్నితమైన' సమాచారం దొరికిందంట. ఏమిటి సున్నితమైన సమాచారం అంటే 1993లో కాశ్మీర్‌లోని వాస్తవాదీన రేఖ వద్ద భారత సైన్యం మోహరింపుకు సంబంధించిన సమాచారం అంట!

1993లోని సైన్యం మోహరింపు సమాచారాన్ని 2002లో గిలానీ తన కంప్యూటర్‌లో ఎందుకు ఉంచుకున్నాడు అన్న అనుమానం ఎవరికైనా రావచ్చు. ఆ సమాచారం అతను ఏదో దురుద్దేశ్యంతో సేకరించినది కాదు, ఏ దురుద్దేశ్యంతోనూ తన కంప్యూటర్‌లో దాచుకున్నది కాదు. 1996లో పాకిస్తాన్‌కు చెందిన ఇన్స్‌టిట్యూట్ ఆఫ్‌స్ట్రాటజిక్ స్టడీస్ అనే సంస్థ కాశ్మీర్‌లో భారత ప్రభుత్వ నిర్వాకాన్ని గురించి ప్రచురించిన ఒక బుక్ లెట్‌లో ఈ సమాచారం ప్రచురించారు. ఆ బుక్ లెట్‌ను ఆరేళ్లుగా ఆ పాకిస్తాన్ సంస్థ పబ్లిగ్గా అమ్ముతున్నది. అందులో భారత సైన్యం మోహరింపు వివరాలు ప్రచురించినందుకు భారత ప్రభుత్వం అధికారికంగా ఎప్పుడూ అభ్యంతరం తెలియజేయలేదు. ఆపుస్తకాన్ని భారత దేశంలో నిషేధించనూ లేదు.

భారత పాకిస్తాన్ సంబంధాలలోనూ కాశ్మీర్ సమస్యలోనూ వృత్తిరీత్యానయినా వ్యక్తిగతంగానయినా ఆసక్తిగల వాళ్ళెవరైనా ఆ పుస్తకాన్ని కొనవచ్చు. కొని దాచుకోవచ్చు. వృత్తిరీత్యానూ వ్యక్తిగతంగానూ కూడా దానిపట్ల ఆసక్తి కలిగి ఉండే హక్కుగల ఇఫ్తిఖార్ గిలానీ ఆ పుస్తకంలోని విషయాలను తన కంప్యూటర్‌లోకి ఎక్కించుకోవడం ఏ రకంగానూ 'నేరం' కాదు. ప్రపంచ వ్యాప్తంగా బజారులో అమ్మకానికి పెట్టిన పుస్తకంలోని సమాచారం అతని దగ్గర 'దొరకడం' అధికార రహస్యాల చట్టాన్ని అతిక్రమించడం ఎట్లా అవుతుంది? పైగా గిలానీ బెయిల్ గురించి ఢిల్లీ కోర్టులో జరిగిన వాదోపవాదాల సందర్భంగా 1993లో ఉండిన సైన్యం మోహరింపుకు సంబంధించిన సమాచారం ఈ రోజు ఒక వ్యక్తి తన దగ్గర దాచుకొని దేశానికి చేయగల నష్టమేమిటని జడ్జి అండగా అనాటి నుండి కూడా ఈ నాటిదాకా వాస్తవాధీనరేఖ వద్ద సైన్యం మోహరింపు అదే నమూనాలో ఉందని ప్రభుత్వ వకీలు అన్నాడంటా!

రెండేళ్ల కింద ఢిల్లీలో ఇఫ్తిఖార్ గిలానీని కలిసినప్పుడు, అప్పుడే పాకిస్తాన్ నుండి తిరిగి వచ్చినట్టు చెప్పాడు. 'దినేషన్' దిన పత్రిక ఎడిటర్ పిలిపించగా పోయివచ్చనన్నాడు. ఆ పత్రిక కార్యలయం ఉన్న లాహూర్‌లో కొన్నాళ్లు ఉండి, అక్కడి నుండి పాకిస్తాన్‌లోని కాశ్మీర్‌కు పోయివచ్చాననన్నాడు. అక్కడి కాశ్మీరీలు 'కాశ్మీర్ సమస్య' గురించి మాట్లాడుతూ, ఇండియా పాకిస్తాన్‌లు ఏమైనా చేసుకోనీ గానీ కాశ్మీర్ భూభాగాన్ని శాశ్వతంగా విడగొట్టకుండ ఉండాలని కోరుకున్నారనీ కాశ్మీరీలంతా కలిసి ఒక దేశంలో ఉన్నట్టయితే ఎక్కడున్నా ఒకటేననే విధంగా మాట్లాడారని అన్నాడు. అదే కాశ్మీరీల చివరి అభిప్రాయం కాకపోవచ్చును గానీ, కాశ్మీరీలు తమ జాతీయ అస్తిత్వాన్ని గురించి ఎంత లోతుగా అవేదన చెందుతారనడానికి ఇదొక తార్కాణం.

ఇఫ్తిఖార్ గిలానీ వ్యక్తిత్వం కాశ్మీరీ జాతీయ వాదానికొక నిదర్శనం. అతనికి పాకిస్తాన్ అన్న ఇండియా అన్న ఒకే రకమైన ఆ గౌరవం. కాశ్మీర్ రేఖాపటంతో ఆడుకోవడమే తప్ప కాశ్మీరీలన్నా వారి మనోభావాలన్నా ఈ రెండు దేశాలకు ఏ మాత్రం గౌరవం లేదన్న సగటు కాశ్మీరీ అభిప్రాయంతో అతను ఏకీభవిస్తాడు. ఇండియాలోని కాశ్మీర్ అభివృద్ధికి ఇండియా ఎంతమాత్రం చేసిందో, పాకిస్తాన్‌లోని కాశ్మీర్ అభివృద్ధికి పాకిస్తాన్ అంతకంటే ఎక్కువ చేయలేదంటాడు. రెండు

ప్రాంతాలలోనూ ఆయాదేశాల కేంద్ర ప్రభుత్వాలకు గులాంలుగా ఉండే ప్రభుత్వాలను ఏదో ఒకటి చేసి నెలకొల్పాలన్న ఆరాటం ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసిందంటాడు. ఈ రెండు దేశాల స్వార్థం నుండి కాశ్మీర్‌నూ కాశ్మీరీలనూ ఎట్లా కాపాడడం, ఎట్లా విముక్తి చేయడం అని ఆవేదన చెందే వ్యక్తిని పట్టుకొని, భారత సైనిక రహస్యాలను పాకిస్తాన్‌కు చేరవేసే 'దేశ ద్రోహి'గా చిత్రీకరించడం చాలా బాధాకరమైన విడ్డూరం.

ఢిల్లీలో ఇఫ్తిఖార్ గిలానీని అరెస్టు చేయడానికి రెండు రోజులు ముందు అతని భార్య తండ్రి అయిన సయ్యద్ ఆలీషాగిలానీని కాశ్మీర్‌లో అరెస్టు చేసారు. 'అధికార రహస్యాల' చట్టం క్రింద అరెస్టు చేశారు. వయోవృద్ధుడైన సయ్యద్ అలీషాగిలానీ భారత సైనిక రహస్యాలను పాకిస్తాన్‌కు చేరవేసే బాపతు మనిషా అంటే ఏమోగానీ, అతను మానసికంగా పాకిస్తాన్ పౌరుడనేది వాస్తవం. అతను కాశ్మీర్‌కు చెందిన జమాతెఇస్లామీ నాయకులలోని 'అతివాద' వర్గానికి చెందిన వాడు. కాశ్మీరీలు అత్యధికంగా ముస్లింలు కాబట్టి కాశ్మీర్ పాకిస్తాన్‌లో చేరాలని నమ్ముతాడు. దీనికి కాశ్మీరీల ఇష్టాయిష్టాలతో సంబంధం లేదు. ముస్లింలు పరాయి రాజ్యంలో బతకకూడదన్న మతవాద విశ్వాసం నుండి ఈ అభిప్రాయం పుట్టిందే తప్ప దానికి ప్రజాభిప్రాయ మనే ప్రజాస్వామిక ప్రమాణం వర్తించదు.

> అతని కంప్యూటర్‌లో దొరికింది అని చెపుతున్న సైనిక సమాచారం ఆరేళ్లకింద ఒక పాకిస్తానీ సంస్థ ప్రచురించి ప్రపంచ వ్యాప్తంగా వేలకాపీలు అమ్మిన పుస్తకంలోని తొమ్మిది ఏళ్లనాటి సమాచారం అని గిలానీ న్యాయవాది, గిలానీ భార్య ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ప్రకటించారు.

అయితే ఈకారణంగానే సయ్యద్ ఆలీషా గిలానీని అరెస్టు చేయదలచుకున్నట్టయితే ఎన్నడో చేసి ఉండవచ్చు ఎందుకంటే ఆయనలో వేరే లోపాలు ఎన్నయినా ఉండనీగాక, తన మనోభావాలను దాచుకునే అలవాటు లేదు. ఎప్పుడూ ఒకే రకంగా మాట్లాడతాడు. ఒకే మూర్ఖత్వాన్ని ప్రదర్శిస్తాడు. అతనిని ఇప్పుడే అరెస్టు చేసి, కాశ్మీర్‌లో సెంట్రల్ జైళ్లు లేనట్లు జార్ఖండ్ రాజధాని రాంచీకి తరలించడానికి కారణం రాజకీయమే తప్ప వేరే ఏమీకాదు. భారత ప్రభుత్వం కాశ్మీర్‌లో వికృతమైన రాజకీయ విన్యాసాలకు పాల్పడుతూ ఉంటుంది. ఆ విన్యాసాల దశనుబట్టి కొందరు స్థానిక రాజకీయ వేత్తలను చేరదీస్తుంటుంది. కొందరిని జైలులో పెడుతుంటుంది. ఎప్పటికప్పుడు దీనికి ఏదో ఒక కారణం చెపుతుంటుంది.

ఏమయితేనేం, సయ్యద్ ఆలీషా గిలానీ అరెస్టు ఎవరికీ పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అయితే వెనువెంటనే ఇఫ్తిఖార్ గిలానీని ఢిల్లీలో అరెస్టు చేయడం ఆశ్చర్యం కలిగించింది. అతను ఏ అర్థంలోనూ పాకిస్తాన్ అనుకూలుడు కాదు. పాకిస్తాన్ ఏజెంటు అసలేకాదు. అయితే మామగారి ఒత్తిడివల్ల మొహమాటానికి పోయి కష్టాలు తెచ్చుకున్నాడే మోనని దూరాన వున్న వారు మొదట అను మానించిన మాట వాస్తవమే. అది నిజం కాదని త్వరలోనే అర్థం అయింది.

అతని కంప్యూటర్‌లో దొరికింది అని చెపుతున్న సైనిక సమాచారం ఆరేళ్లకింద ఒక పాకిస్తానీ సంస్థ ప్రచురించి ప్రపంచ వ్యాప్తంగా వేలకాపీలు అమ్మిన పుస్తకంలోని తొమ్మిది ఏళ్లనాటి సమాచారం అని గిలానీ న్యాయవాది, గిలానీ భార్య ప్రెస్ కాన్ఫరెన్స్ పెట్టి ప్రకటించారు. ఆ సమాచారం ఎవరిదగ్గరైనా ఉండవచ్చును. కాగా, ఇఫ్తిఖార్ గిలానీ ఒక పాకిస్తానీ దిన పత్రిక విలేకరి కావటం వల్ల పాకిస్తాన్‌లో ప్రచురించిన పుస్తకాలు, వాటిలోని సమాచారం అతని దగ్గర 'లభ్యంకావడంలో అసహజమూ లేదు. ఆశ్చర్య పోవలసిందీ లేదు.

ఢిల్లీలోని పత్రికా విలేకరుల సంస్థలు ఇఫ్తిఖార్ గిలానీ అరెస్టుకు బాగానే స్పందించాయి. అతని మీద పెట్టిన అభియోగం సందేహాస్పదమయినదని ప్రకటించాయి. దీని ప్రభావం ప్రభుత్వం మీద పెద్దగా ఉండకపోవచ్చును గానీ ఆ మాత్రం స్పందన రావడం మంచిదే .

అయితే ఇఫ్తిఖార్ గిలానీకి తీహార్ జైలులో చేదు అనుభవం ఎదురైనటు వార్తలొచ్చాయి. జైలులో కొందరు ఖైదీలు అతని పైన దాడి చేసి కొట్టారంట. జైలులోపల కూడ దేశభక్తు లుంటారు మరి వారు గంజాయి వ్యాపారస్తులు కావచ్చు, రేపిస్టులు కావచ్చు, కిరాయి హంతకులు కావచ్చు, ఏమైనప్పటికీ వారు దేశభక్తులు కూడా కావచ్చు. ఇఫ్తిఖార్ గిలానీ వంటి దేశద్రోహులను చూస్తే వారి దేశభక్తి ఆగదు. ముస్లిం తీవ్రవాదులో 'ఐఎస్ఐ ఏజెంట్లు' అనే అభియోగాల మీద ఢిల్లీలో జైలుకు పోయినవారందరూ ఈ గొప్పసత్యాన్ని చాలా బాధ్యకరమైన అనుభవంద్వారా గ్రహించారు. చాలా సున్నితుడు, సంస్కారవంతుడు అయిన ఇఫ్తిఖార్ గిలానీకూడ ఇప్పుడు గ్రహిస్తున్నాడు.

అతను ఏదో ఒక రోజు బయటకి వస్తాడు. అతనిని దీర్ఘకాలం జైలులో ఉంచగల ఆధారాలేవీ పోలీసుల దగ్గర లేవు. బయటికొచ్చేనాటికి అతనికి భారత ప్రజాస్వామ్యం మీద, మొన్నటిదాకా ఉన్న గౌరవం ఏమైనా ఉంటే అది మిగిలి ఉండదు. అతని గురించి వాస్తవాలు తెలిసిన వారెవ్వరిలోనూ మిగిలి ఉండదు.

కాశ్మీర్ వ్యవహారాలలో ప్రజాస్వామ్యాన్ని ఈ విధంగా ఒక్కొక్క అంగుళమే యాభైఏళ్లుగా హతమార్చబట్టే పరిస్థితి ఇక్కడి దాకా వచ్చింది. అయినప్పటికీ ఏ గుణపాఠం నేర్చుకోని భారత్ బయటి శత్రువులను తప్పుపట్టడం ఎందుకు?

◆